

# దయ్యాన్ని కాదంటూంటే

బొడ్డు బాపిరాజు

"Your Father burnt to death in the recent Agra - mandi fire.

Radha Lal"

ఏప్రిల్ 1 వ తేదీ

కొడుకు—'మా నాయనో!'

తల్లి—'మా దేవుడో! దేవుడో!'

"ఇంతలో ఎంత మూడిందిరో ఓ దేవుడో! వర్షం లేని పిడుగురో మా నాయనా!"

"పిడుగు లేని మంటే మాఅమ్మో! మా నాన్నను మరి చూడలేమే అమ్మా నాలుక తడి ఆర్చుకుపోతుందే."

"పోతే నాయనా! మంచినీళ్లు తాగి మళ్లా ఏడుద్దువు గానిలే!"

"అమ్మో! నాన్నకు గార్లంటే మాయిష్టమే పడి చచ్చి పోయేవాడు"

"నీకు తెలీదుకాని అబ్బాయి! అనాయాసంగా మూడు పుంజీలు గుంజేవారురో చెప్పుకుంటే దిష్టిచేటు మాతల్లో!"

"కడుపునొప్పన్నా వచ్చేది కాదు అమ్మా చేతులారా సర్జికోటు కుట్టించలేక పోయాడే! డబ్బుందిగాని వృత్తి పిసినారే. ఏం కట్టుకుపోయాడు!"

"ముక్కుపుడకరాయి నీరు దిగితే తీయించేవాడు కాదురా! ఇంకా ముక్కుపుడక లెందుకురా! నేను వెధవ ముండ నాతానురోయ్!"

"ప్రొద్దున్నే లేవంగానే ఎదురుపడకే పని చెడుతుందే మాయమ్మా!"

"అంతా వస్తున్నారు బిగ్గరగా ఏడవరా నాయనా! మాదేవుడో దేవుడా! దేవుడా!!"

"మా నాయనో! నాయానా!"

"మాయదారి మాదేవుడో!"

"నాయనా! ఒక్కసారి వచ్చి పలకరింపరాదా! పోనీలే ఇకనుంచి తప్పకుండా బడికెళ్తాలే! కొట్టినా ఏడవను!"

"మాదేవుడు మాయమయ్యాడండోయ్! ముద్దు ముఖాల కోరికలు తీరినై అండోయ్! నేనింక బతక నండోయ్ మా నాయనా! తండ్రి లేని బిడ్డవురో!"

"ఇనప్పెట్టి తాళాలెక్కడే!"

"దాళాన్నే! బుడ్డిచెంబులో పెట్టి మూలింటి గూట్లో! ఇంకా రాగం రాచ్చు మాదేవుడో! దేవుడా!!"

అందరూ "ఊరుకోండల్లా ఒకటేగుక్క తిప్పుకో కండా ఏడుస్తున్నారు. కొంచెంసేపు మాటల్ చెప్పు కోండి మిమ్మల్నే! ఆగమంటూంటే. పాపం ఇంటికి నిండుగా వుండేవాడు ఆ బొజ్జ మనిషికి అందం తెచ్చేది—"

"మాయదారి బొజ్జ ఎంతేనా బాగుండేదండోయ్! వేసంకాలంలో గంధపుచెక్కంతా అరిగిపోయేదం డోయ్! మా మెత్తనిబొజ్జ దేవుడా!"

"పెరుపుకంటే మెత్తనిబొజ్జ మానాన్నదీ! తొక్క మనసయ్యేది మా నాన్నా!"

"బ్రాహ్మల్ని పిలిపించండోయ్! మా చిట్టిబాబు కర్మ చెయ్యాలి! శవాన్నికూడా చూడకపోతిమిరా దేవు డా! ఆయనకు జరీమల్లె కండువా మాయిష్టమండోయ్."

"పోనీలేఅమ్మా! నేనా కండువా కప్పుకునే కర్మ చేస్తాలే! ఇంకేం వూరుకో"

"అందరూ జారారు నెమ్మదిగా. అదుగో బ్రాహ్మడు వస్తూవున్నాడు. చాల్లే ఏడవకపోయినా ఫరవాలేదు."

"తక్కువఖర్చులో ముగించమనాలి. లేకపోతే పిప్పి పీల్చేస్తారు. రథంకూడా కొను"

"మా - దేవు - డూ! దేవు—"

"మా—నా—య—నా—!"

చెంచయ్యశెట్టి ఎంత ధనవంతుడో అంత పిసినిగొట్టు. ధనానికి మించిందికాదు ప్రాణం. వృత్తికరోడా. పెద్ద వ్యాపారం. ఒక్కడుకు యంబ్రహ్మ. ఓపెళ్లాం దేబె. సాగించాడు రథం చక్రాల్లేకుండా. అన్నం సరీగా తినే వాడు కాడు కర్చుకు జడిసి. దాన్‌తలగొయ్యా పొట్ట మాత్రం గౌరీశంకర శిఖరంలా మీదికి చొరచుకొని వచ్చేది. పాదాలు తామరపువ్వులు కావు అల్చిప్పలు. తొడలు చంద్రముఖరాలు. రొమ్ము గానుగరాయి. చేతులు బండకొయ్యలు. ముఖం బూర్లమూకుడు. పెద వులు చుట్టపీకలు. కళ్లు చింతాకులు. ఇక చాలు. ఇవన్నీ నిలబెడితే చెంచయ్యశెట్టి తయారయ్యాడన్నమాటే. మీకు నవ్వుగాని ప్రబంధాల్లో వర్ణించిన నాయకులకంటే బాగుంటాడు. తాబేటి చిప్పలు నాగుపాములు అంబుల పొదులుకంటే ఇవి నయమే.

అల్లాంటి చెంచయ్యనే మనవాడు పనుండి ఆగ్రా వెళ్లాడు. అంతే సంగతి మీకు తెలియవలసింది. మేం చెప్పవలసింది. ఆమాటకొస్తే మీరు వినక వినిపించుకోక పోయినా మేం చెప్పవలసిందంతే.

రాత్రి గం 9-18. ఏప్రిల్ 24

"తలుపు! తలుపూ!" '(దెబ్బ!)'

"2 గుద్దులు టక్, రకా."

"గొల్లేం - గలగళ గళాగిళా"

ఇంట్లో నిద్రలోనుంచి వులికిపడి లేచాడు కొడుకు.

"అమ్మో దొంగ—నాకు భయమేస్తుందే. అదుగో! అదుగో!" ("తలుపు' గుద్దు 1, 2")

"అమ్మో ఎవరో పిలుస్తున్నారే!"

తల్లి కళ్లు నులుముకుంటూ లేస్తుంది.

"ఎవర్రా! అర్ధరాత్రి పడుకో!"

("1, 2, 3 4 5, దడదడధాడాధధా!"

"ఆ! ఎవరూ!...(తలుపూ!) అబ్బాయి నిదానించి విను. మీ నాయనమాటలా వుంది. కొంచం బొంగురు. ఊ. అంతే నిజంగా అంతే!"

"తలుపు తీసి రావే!"

"అమ్మో దయ్యం! బాబో దయ్యం దయ్యంరా దయ్యం"

"దయ్యమే దయ్యం! దయ్యం!"

"దయ్యం! - ఏడుస్తాడు - ఓదయ్యం ఊ—ఏడుస్తాడు."

"ఇదేం కర్మరా! అమ్మో దగ్గరకొస్తావుందిరోయ్ బాబో!" - వంటింట్లోకి వెళ్లి తలుపువేసుకొని కిటికీలోనుంచి చూస్తావుంటారు.

దయ్యం "నన్ను గుర్తుపట్టలేదట్రా? దయ్యం అంటారు. మీ దయ్యం ధగ్గింకొను తలుపు తియ్యండి"

"శార్ధం బాగా చేశాంగా దయ్యం! గార్లుకూడా వండిపెట్టాం పాత్తరలో రాగిగ్లాసులుకూడా పెట్టాం మళ్లా ఎందుకొచ్చావ్!"

"నాయనా! దయ్యానికాళ్లు ఎనక్కి తిరిగుంటా యంటారు చూడ్రా నాకు సరిగా అనటంలేదు."

"అమ్మో నేన్‌చూట్టమే. అదుగో మంట. కొరవి దయ్యమే దయ్యం"

"నేను దయ్యాన్ని! కలగంటున్నారా? ఒసేపిల్లా నీక్కూడా గుర్తు చిక్కటంలేదటే. ఆగ్రా ఎల్లి సరిగా నెలన్నాకాలేదు అప్పుడే ఎక్కడ చచ్చానే కర్మగతి! పోని నీకు నమ్మకంలేకపోతే ఇట్లా వచ్చి నన్ను ముట్టుకో నీకే తెలుస్తది. రా."

"అమ్మో వెళ్లకే దయ్యం మింగుతుంది. ఇట్లాగే చెప్తావుంది. తలుపు తియ్యకేయ్! బాబో! మింగేస్తుందోయ్. చూడుచూడు గుడ్లలా మిటకరిస్తుందో! దయ్యం మమ్మల్ని

వదలిపోతే! నీకండవా వేసుకోనుతే. జరీకండ్వా మడతపెట్ట పెట్టెలో పెట్టేస్తాలే. మాజోలికి రాక, నీకు కొబ్బరికాయ కొడ్తాలే. నీపటానికి రోజు సాంబ్రాణివత్తులు గుచ్చి వెలిగిస్తాలే—లెంపలు వేసుకుంటాడు—"

"అవున్ రో! నిజమే దగ్గరకెళ్లను బాబు! చూస్తే మన మనిషి వాలకమేరా! చూడు"

"కొంటెవెధవా! తలుపుతీస్తావా లేదా నాటకమా! నన్ను చూసి దయ్యంఅంటావా!"

"అమ్మయ్యో! ఎట్లా మీదికొస్తుందో! నిజంగ దయ్యంవే!"

"ఒసేపిల్లా! తలుపు తియ్! ఇప్పుడే మెయిల్ దిగి వచ్చాను. ఇదిగో పెట్టె ఫరుపు. ఇంకా నమ్మకంలేదు. దయ్యంఅయితే పెట్టెలావస్తుంది?"

"అమ్మో! నమ్మకే. అవన్ని వుత్తిమాటలు వుత్తిమాటలు. మసాలావడియాల్లా నవిలిమింగేస్తుంది."

"దయ్యంకాదేమోరా! అదుగో పెట్టే పరుపూ చారల కోటూ అదే అట్టలూడిన కిర్రుచెప్పులు అవే గోరంచు కండవాకూడా అదేరా! అన్నిమట్టుకు అయనవే!"

"దయ్యాలన్ని సంపాదిస్తాయే! వాటిన్నమ్మగూడదు. నిజంగా మనిషిలావుంటాయి మాట్లాడతాయి అన్నం తింటాయి. పడుకుంటాయి బిడ్డల్నికూడా కంటాయి. ఓసే! దయ్యం, నిజంగా మరి నీవు మానాన్నవే అయితే తగలబడిపోయి మళ్లా ఎట్లా బదికావ్! మరి మాకు టెలిగ్రాం వచ్చింది.

"టెలిగ్రాం ఏంటి! నీ మొఖం యీడ్చా, దాన్నిలాతే— ఆ యిదీ! ఒతే తెలివితేటలు! మిమ్మల్ని రాధాలాలు హాహా హా "April Fools" ని చేశాడురా! అదీసంగతీ! దిట్ట మైనవాడవురా! దయ్యాన్ని కాదంటూంటే నమ్మలా"

"కొడుకు—"ఆ మా నాయనే!"

"తల్లి—"ఆ. ఆ. మా అయనే!"


# ప్రకటన రేట్లు

| | | | |
|---|---|---|---|
| ఒకసారికి | 1 | పుటకు | రూ 30—0—0 |
| ,, | ½ | పుటకు | రూ 15—0—0 |
| ,, | ¼ | పుటకు | రూ 7—8—0 |

**వివరములకు:—**

## "వినోదిని" కార్యాలయము

**234,** గోవిందప్పనాయక్ వీధి, జి. టి. మద్రాసు.